క్లుప్తంగా

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం

వీరపునాయునిపల్లె : మండలంలోని యరమల పల్లెలో ఆదివారం నిర్వహించిన చెన్నకేశవ స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రేణుక దంపతులు కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామోత్సవం ఉత్సాహంగా జరిగింది. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

నూతన వధూవరులకు అశీర్వాదం



వధువరులను అశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని తిప్పిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్బారెడ్డి కుమారుడు నూతన వధువరులైన సుబ్బారెడ్డి, ఆశాజ్యోతిల వివాహం ఆదివారం తిప్పిరెడ్డిపల్లెలో జరిగింది. వివాహ వేడుకకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరై నూతన వధువరులను అశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ మండల ఉపాధ్యాక్షుడు నాగమల్లారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.


పరామర్శ



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి

కమలాపురం : మండలంలోని మీరాపురంకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు రాజేంద్రనాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులను ఆర్టీసీ మాజీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి పరామర్శించారు. రాజేంద్రనాథ్‌రెడ్డి అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. అందుబాటులోలేని కారణంగా మల్లికార్జునరెడ్డి ఆదివారం మృతుని నివాసానికి చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ధైర్యంగా ఉండాలని, తాము, పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాలా ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ మృతి



పి.శ్రీనివాసులు(ఫైల్)

కమలాపురం : ఉపాధి హామీ పథకంలో పనిచేసే పందిళ్లపల్లె ఫీల్డ్ అసిస్టెంట్ పి.శ్రీనివాసులు (56) గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం గుండెలో నొప్పిగా ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు కమలాపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే గుండె పోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా మృతుడికి భార్య లక్ష్మీ నరసమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమాడు ఉన్నారు. ఇటు పని చేసే కార్యాలయంలో, పని ప్రదేశంలో శ్రామికులతో శ్రీనివాసులు కలివిడిగా ఉండటంతో ఆ ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ పార్థసారథి మృతి చెందడంపై సంతాపం వ్యక్తం చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి



వల్లూరులో జరిగిన నరసింహస్వామి గ్రామోత్సవంలో కోలాట ప్రదర్శన

వల్లూరు : పడమట వీధిలో వెలసిన శ్రీ నరసింహస్వామి ఆలయంలో ఆదివారం జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకాలను, విశేష పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్ర పటాన్ని ట్రాక్టర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి డప్పు వాయిద్యాల నడుమ గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామోత్సవం వెంట సాగిన కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. భక్తులు కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా స్థానిక ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక మహిళలు స్వామి సేవలో పాల్గొని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

తాటి ముంజల్లో పోషకాలు



విక్రయించేందుకు తాటి ముంజలను కొడుతున్న వ్యాపారులు

పులివెందుల రూరల్ : వేసవి కాలంలో తాటి ముంజలకు భలే డిమాండ్ ఉంటుంది. వేసవికాలం అంటే వెంటనే గుర్తుకొచ్చేది తాటి ముంజులు. తాటి ముంజల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. తాటి ముంజల్లో శరీరానికి చలువ చేసే గుణాలు ఉండటంతో కొనేందుకు ప్రజలు ఎక్కువగా ఇష్టపడతారు. వేసవి రాగానే నందిమండలం, పెండ్లిమర్రి, పులివెందుల మండలం ఎర్రిపల్లె, అచ్చివెల్లి, పుత్రాయునిపేట తదితర గ్రామాల నుంచి తాటి ముంజలను కోసుకుని వచ్చి పులివెందులలోని మెయిన్ బస్టాండ్, పాత బస్టాండ్, పూలఅంగళ్ల వద్ద, కొత్త బస్టాండ్ తదితర ప్రాంతాలలో వ్యాపారులు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు తాటి ముంజులు అమ్మకాలను సాగిస్తుంటారు. తాటి ముంజలను డజన్ రూ.100ల చొప్పున విక్రయిస్తుంటారు. తాటి ముంజలను కొనేందుకు ప్రజలు కూడా ఇష్టపడతారు. వ్యాపారస్తులకు సైతం లాభసాటిగా ఉండటంతో ప్రతి ఏడాది మార్చి నెల రాగానే వ్యాపారస్తులు తాటి ముంజలు తీసుకొచ్చి రోడ్ల వెంబడి ఎండలకు టెంట్లు వేసుకుని విక్రయాలు సాగిస్తుంటారు.

తాటి ముంజల్లో పోషకాలు

తాటి ముంజలు రుచిగా ఉండటంతో చిన్నపిల్లలు, పెద్దలు సైతం నాలుగైదు తినేస్తారు. వీటిలో పోషకాలు అధికంగా ఉంటాయి. వైద్యులు మాత్రం వీటిని తొక్కతో తింటేనే మంచిదని సూచిస్తున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న తాటి ముంజలు

ముదిరిన తాటి ముంజలను తింటే కడుపునొప్పి వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు అంటున్నారు. ఇక పోషకాలు విషయానికొస్తే తాటి ముంజలు శరీరంలో నీటి శాతాన్ని పెంచుతాయి. ఎండ వేడిమికి గురికాకుండా కాపాడుతాయి. వీటిలో విటమిన్ ఏ, బి, సిలతోపాటు శరీరానికి కావలసిన జింక్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్‌ను అందిస్తాయి.. ట్యూమర్లు క్యాన్సర్ రాకుండా కాపాడతాయి. పొటాషియం అధికంగా ఉండటంతో రక్తపోటు తగ్గించి శరీరంలోని మలినాలను బయటికి పంపుతుంది. కడుపు ఉబ్బరం, వికారం, మలబద్ధకం సమస్యలను తగ్గిస్తాయి. రోగ నిరోధక శక్తిని పెంచి లివర్ సమస్యలను తొలగించి చర్మ సౌందర్యానికి దోహదపడతాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రతి ఒక్కరికి తాటి ముంజలు ఇష్టం



వేసవి రాగానే వెంటనే గుర్తొచ్చేదీ తాటి ముంజలు. తాటి ముంజుల అంటేనే ప్రతి ఒక్కరికి ఇష్టం. వేసవికాలంలో మా కుటుంబ సభ్యులందరూ వారంలో నాలుగైదు రోజులు తాటి ముంజలు తింటూనే ఉంటాం. పులివెందులలోని మార్కెట్లో డజన్ రూ.100ల చొప్పున తాటి ముంజలు విక్రయిస్తుంటారు. నిత్యం వాటిని కొని తింటాం. తాటి ముంజలు తినడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి.

– విశ్వనాథరెడ్డి, స్థానికుడు, పులివెందుల

బీఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న బీఈడీ కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా బీఈడీ కళాశాలలన్నీ యూనివర్శిటీ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయన్నారు. కాలేజీల్లో స్టాఫ్ ఉండరని, కనీసం ల్యాబ్‌లు కూడా ఉండవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఏ కాలేజీలో కూడా విద్యార్థులు ఉండరని, బయటి రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు నిర్వహించుకుంటూ వేల రుపాయల ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. చాలా చోట్ల కనీసం కళాశాలల తలుపులు కూడా తెరవని పరిస్థితి ఉందన్నారు. ఎడ్‌సెట్ నోటిఫికేషన్ వచ్చిన వెంటనే కళాశాలల యాజమాన్యాలు బయటి రాష్ట్రాల నుంచి అడ్మిషన్లు చేసుకుంటున్నారని మండి పడ్డారు. యూనివర్శిటీ అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చల్లంగ చూడమ్మా..



ప్రత్యేక అలంకారంలో అంకాలమ్మ అమ్మవారు

పులివెందుల టౌన్ : పట్టణంలో వెలసిన శ్రీఅంకాలమ్మ తల్లి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా చూడమ్మ అంటూ అమ్మవారికి వేడుకున్నారు. కాయకర్పూరాలు సమర్పించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

శేషవాహనంపై మోక్షనారాయణుడు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



హోమాలు చేస్తున్న సాయినాథ శర్మ దంపతులు

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్షనారాయణుడు శేషవాహనంపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి ఆలయ ప్రధాన సేవకుడు సాయినాథశర్మ ఆధ్వర్యంలో జరుగుతున్న మోక్షనారాయణుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండితుల మంత్రోచ్చారణల మధ్య ఉదయం అభిషేకాలు, మండల ఆరాధన, అరుణ పారాయణం నిర్వహించారు. సాయంత్రం వివిధ రకాల హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్షనారాయణుడు శేష వాహనంపై, శ్రీవల్లిదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారు అశ్వ వాహనంపై మాడ వీధుల్లో ఊరేగి భక్తులకు నయనానందం కలిగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

భక్తి శ్రద్ధలతో దేవర



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు : మండలంలోని అయ్యవారిపల్లెలో పెద్దమ్మతల్లి దేవర వైభవంగా నిర్వహించారు. ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు, మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇళ్లు బంధువులతో కళకళలాడాయి. అయ్యవారిపల్లెలో దేవర కావడంతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎ మ్మెల్యే సుధీర్‌రెడ్డి అమ్మవారికి ప్రత్యే కపూజలను నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తొండూరు : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం కృష్ణారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఆత్మీయ సమ్మేళన వేదిక స్నేహితుల కొలువు ఈవేదిక, ఎవ్వరు ఏ స్థితిలో ఉన్నా ఎవ్వరు ఏ గమ్యం చేరినా కలిమిలోనైనా లేమిలోనైనా కలకాలం కలిసుందామని ఒకరికొకరు చెప్పుకునే రోజు ఈ రోజు ఇదే..ఇదే.. పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం. తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించుకుని సంబరపడ్డారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ నవ్వుల సంద్రంలో మునిగి తేలారు. పెద్దలంతా పిల్లలుగా మారి సందడి చేయడం గురువులను కూడా సంతోష పెట్టింది. చివరగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించుకున్నారు. కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు, నాటి గురువులు నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, చంద్రశేఖరరెడ్డి, రమణారెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసులు, ప్రదీప్, మధు, లక్ష్మినారాయణరెడ్డి, రమణ పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : పట్టణంలోని తాడిపత్రి రహదారిలో ఉన్న బాలాజీ హైస్కూల్‌లో చదువుకున్న పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్నారు. ఆదివారం బాలాజీ విద్యాసంస్థల డైరెక్టర్ బైరెడ్డి రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో వారు కలుసుకున్నారు. ఈ సందర్భంగా బైరెడ్డి రవీంద్రారెడ్డి మాట్లాడుతూ 2000–2021 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఒక్కచోట తిరిగి కలసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారన్నారు. కష్టపడి చదువుకున్న వారు కచ్చితంగా ఉన్నత స్థాయిలో ఉంటారనటానికి మీరే నిదర్శనంగా నిలిచారన్నారు. పూర్వ విద్యార్థులు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



జమ్మలమడుగు : అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

ఘనంగా అమ్మవారికి బోనాలు



అమ్మవారికి బోనాలు తీసుకెళుతున్న మహిళలు, గ్రామస్తులు

సింహాద్రిపురం : మండలంలోని రావులపాలెం గ్రామంలో వెలసిన మారెమ్మతల్లి పదవ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు మహిళలు బోనాలు తలపై పెట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

అలరించిన ఖవ్వాలి



ఖవ్వాలి పోటీలలో పాల్గొన్న పీఠాధిపతులు

జమ్మలమడుగు : పట్టణంలోని పలగాడివీధిలో ఉన్న సయ్యద్‌షా బడేగాస్‌పీరాఖాద్రీ 93 ఉరుసు మహోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం పీఠాధిపతి సయ్యద్‌షా గాస్‌పీరాఖాద్రీ, ఆయన కుమారుడు సయ్యద్‌షా తాహీర్‌పీరాఖాద్రీల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు. ఉరుసు సందర్భంగా వేలాది మంది శిష్యులు భక్తులు స్వామి వారి దర్గా వద్ద ప్రత్యేక ఫాతేహాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు గొప్ప ఖవాలి పోటీలను నిర్వహించారు. ఖవ్వాలిలు నొషద్ షోలా, ఖాసీం హసీఫ్ సాబ్రీలు పీఠాధిపతులపై ప్రత్యేక గానాలు అలపించారు. ఆదివారం ఆమీల్ ఆరీఫ్, నొషద్‌షోలాల ఆధ్వర్యంలో ఖవ్వాలి పోటీలు రసవత్తరంగా జరిగాయి.

కార్పొరేట్ లాభాలకోసమే నాలుగు లేబర్ కోడ్లు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ సంస్థల లాభాల కోసం తెచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లు రద్దుచేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శులు ఎల్.నాగసుబ్బారెడ్డి, బి.మనోహర్ డిమాండ్ చేశారు. పేర్కొన్నారు. కడప నగరంలోని వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన జవాన్లకు నివాళులర్పించి జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరుతూ ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. బ్రిటీష్ వారితో కార్మికవర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను రూపుమాపి మోదీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోట్లు తెచ్చిందని విమర్శించారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న లక్ష్మీనరసింహస్వామి

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహ హరి ప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయణం, మహామంగళహారతి, సాయంత్రం హన్‌మత్ వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కొన్నేర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఉంజల్‌సేవ, రాత్రికి గరుడసేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయ అవరణలో ఎద్దులచే బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశామన్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని పొట్టిపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం వేదపండితులు ఆదివారం ఘనంగా నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాత్రి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు. వ్యవసాయ సేద్యపు ఎద్దులతో బిరుబండి లాగు పోటీలను నిర్వహించారు. మొదటి బహుబతి రూ.30 వేలు, రెండవ బహుమతి రూ.20 వేలు, మూడవ బహుమతి రూ.15 వేలు, నాలుగోవ బహుమతి రూ.10 వేలు అందజేశారు.

నేడు మొలకల పౌర్ణమి వేడుకలు



లింగాల గ్రామంలోని మొలక కుంపట్లు

లింగాల : మండలంలో లింగాల, వెలిదండ్ల, పార్నపల్లె, బోనాల, కోమన్నూతల, అక్కులగారి పల్లె తదితర గ్రామాల్లో సోమవారం మొలకల పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమావాశ్య తరువాత నవదాన్యాలతో కుంపట్లలో మొలకలు పోసి మహిళలు పూజలు చేసి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించనున్నారు. వెలిదండ్ల గ్రామంలోని వరదరాజులస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజులస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే 13వ తేదీ వెలిదండ్ల గ్రామంలో బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు.

సింహాద్రిపురంలో..

సింహాద్రిపురం : మొలకల పౌర్ణమిని పురస్కరించుకుని గ్రామాలలో మహిళలు 9 రోజుల నుండి నవధాన్యాలు సేకరించి మొలకలను కుప్పట్లలో వేసి మొలకలు వేశారు. పంటలు బాగా పండాలని పూర్వం నుంచి వస్తున్న ఆచారాలను పాటిస్తూ సోమవారం ప్రత్యేక పూజలు చేయనున్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండపై వెలసిన బోగాదమ్మ, పాలగిరి క్రాస్ వద్ద వెలసిన కాశిరెడ్డినాయన ఆలయం, సంగాలపల్లె గ్రామంలోని శ్రీ శివకృష్ణ గోశాలలో సోమవారం మొలకల పౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 9 గంటలకు బోగాదమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, 10 గంటలకు కోలాటం, 12 గంటలకు అన్నదానం, రాత్రి 9 గంటలకు నటరాజ బృందం వారిచే సాసవల చిన్నమ్మ కథ ఏర్పాటు చేశారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

ఘనంగా తిరుప్పావడి సేవ



తిరుప్పావడి సేవలో భక్తులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని వాసవీ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం ఉదయం తిరుప్పావడి సేవ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయం ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తోమాలసేవ, సహస్రనామార్చన, కలశారాధన కార్యక్రమాలతోపాటు నిత్యహోమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి జయంతి సందర్భంగా మూలమూర్తులకు పట్టు వస్త్రాలు అలంకరించారు. రాత్రి ఉత్సవ మూర్తులకు ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. నేడు శ్రీదేవి భూదేవి సమేత వసంత వల్లభస్వామి తిరు కల్యాణోత్సవాన్ని సోమవారం సాయంత్రం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. అలాగే అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు



మంచినీటిని అందిస్తున్న ట్యాంకర్

వేంపల్లె : పంచాయతీ పరిధిలోని రాజీవ్‌కాలనీలో ఉన్న తాగునీటి బోరుకు మరమ్మతులు చేపట్టారు. పది రోజులుగా రాజీవ్ కాలనీలో ఉన్న తాగునీటి బోరులో భూగర్భ జలాలు అడుగంటి పోయి ఆ ప్రాంతంలో ఉన్న ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తాయి. సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు విద్యుత్ మోటార్‌కు మరమ్మతులతోపాటు అదనపు పైపులు బోర్లలో దించాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో ఆదివారం పంచాయతీ వాటర్ స్కీం సిబ్బంది తాగునీటి బోరులో మోటర్‌కు మరమ్మతులు చేయించి పైపులు దించి ప్రజలకు తాగునీటిని అందించారు. అలాగే పంచాయతీ పరిధిలో కొన్ని ప్రాంతాల్లో తాగునీరు రాకపోవడంతో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయించారు. ఆప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్యాగరాజ ఆలయ విగ్రహాల గ్రామోత్సవం



త్యాగరాజస్వామి విగ్రహాల గ్రామోత్సవం

వేంపల్లె : స్థానిక గాండ్లవీధిలో (ఆర్టీసీ బస్టాండ్ పక్కన) వెలసిన త్యాగరాజ నూతన ఆలయ విగ్రహాలను ఆలయ కమిటీ సభ్యులు గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం గ్రామ పురవీధుల గుండా విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. అర్చకులు తెల్లవారుజామున పూజలు, విగ్రహ శుద్ధి, దీక్ష హోమాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం విగ్రహ ప్రాణ ప్రతిష్ట, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, గోదర్శనం, జ్వాలా దర్శనం తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. నాయి బ్రాహ్మణులు పెద్ద ఎత్తున పాల్గొని త్యాగరాజస్వామిని ఊరేగింపుగా తీసుకెళ్లారు. నేడు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందని ప్రజలందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే సాయంత్రం ఐదు గంటల నుంచి ఏడు గంటల వరకు స్థానిక ఉర్దూ షాది ఖానా కల్యాణ మండపంలో గొప్ప నాదస్వర కచేరి ఉంటుందని తెలిపారు.

శిల్పారామంలో అలరించిన కార్యక్రమాలు



శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మదనపల్లె సూర్య డ్యాన్స్ అకాడమి చిన్నారులచే శాస్త్రీయ, జానపద నృత్యాలతోపాటు సినిమా పాటలకు నృత్యాలు చేసి అందరిని మెప్పించారు. జానపద నృత్యాలతో ఆకట్టుకున్నారు. వేసవి సెలవులు కావడంతో శిల్పారామం సందర్శకులతో కిటకిటలాడింది. శిల్పారామం పరిపాలనాధికారి విశ్వనాథరెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.